# కుబుసం

ఇంట్లో పాము తిరగాడుతున్నట్టుంది. వినిపించని బుసబుస. కనిపించని ఆనవాలు. కుబుసం విప్పే రోజుల్లానే వుంది. అయినా కుబుసం రెపరెపల ఆనవాలు నేల

మీద యెక్కడా కనిపించటం లేదు. కచ్చితంగా తిరగాడుతున్నట్లు తెలిస్తే యింట్లోంచి పాముని పంపించే మార్గమైనా వెతకొచ్చు. లేదా యిల్లు విడిచైనా పారిపోవచ్చు... యెక్కడికి?!

అక్కడికి పాము రాదా?! పాముల్లేని చోటిక్కడైనా వుందా...జర్‌జర్... పాము...పా....

'యింతకీ యేమంటావ్'

అతని వైపు వోసారి చూసి తిరిగి చూపులు పుస్తకంలోకి చాపింది.

'ఉత్తరా...నువ్వు నా సహనాన్ని పరీక్షిస్తున్నావ్? యేమిటి నీ బాధ... యెప్పటికి నీ వుద్యోగం నీ యిష్టాలు నీలోకమే తప్ప నేననేది నీకెందుకు అర్థం కాదు' విహారి చాలా నిదానంగా నింపాదిగా అడిగాడు.

'నా లోకంతోపాటు నువ్వు అంటుంది అర్థం అవుతుంది. యెటొచ్చి నువ్వే నీ ఆలోచనల్ని మార్చుకున్నావ్... వొక్కసారి చెక్ చేసుకో' అంతకంటే నిదానంగా నింపాదిగా చెప్పిందామె.

'వో.కె. నే వెళుతున్నా. టైమ్ అవుతుంది' విహారి బ్యాగ్ తీసుకొని బయటకి వచ్చాడు.

టాక్సీలో కూర్చుంటూ యింటి వైపు చూసాడు. ఉత్తర అతని వైపే చూస్తుంది. ఆ చూపులో నిశ్శబ్దం. అతనికి చికాకేసింది. బీచ్ రోడ్డు నుంచి మలుపు తీసుకొని టాక్సి యేయర్‌పోర్టు వైపు సాగిపోతోంది.

యేముందీ వూర్లో... సముద్రం తప్ప.... యేం సముద్రం వొడ్డున యిల్లో... అన్నిటికీ తప్పుపట్టటమే.

చెక్ యిన్ చేసి సెక్యూరిటి చెక్‌లోకి వెళుతూ యింటికి వొకసారి ఫోన్ చేస్తే... ఉత్తర నిర్ణయంలో మార్పుంటే ప్లెజెంట్ జర్నీ కదా...మార్పు లేకపోతే...

యింటికి కాల్ చేసాడు.

'హలో' సాక్షి

'స్కూల్ నుంచి వచ్చేసావా'

'ఆ... బోలెడు హోమ్‌వర్క్ యిచ్చింది టీచర్... మమ్మి పాలు తాగాక ట్యూషన్‌కి వెళ్లమంటుంది. కార్టూన్ నెట్‌వర్క్ చూస్తా డాడి... వొక్క అరగంటే

మమ్మికి చెప్పండి డాడీ' స్వాప్నీ బ్రతిమాలేస్తున్నాడు.

'వో.కె. వో.కె.... మమ్మీకి యివ్వు'

'మమ్మీ... డాడీ' స్వాప్నీ తండ్రి రికమండేషన్ చేస్తాడన్న నమ్మకంతో అరిచాడు.

ఉత్తర రిసీవర్ చేతుల్లోకి తీసుకొంది.

'కాసేపు కార్టూన్ నెట్‌వర్క్ చూస్తాడంట చూపించు ఉత్తరా...' ఆగాడతను.

అతను యెందుకు ఆగాడో తెలిసిన ఆమెకి క్షణం నిశ్శబ్దం తర్వాత అతనేం అడగబోతున్నాడో తెలుసు.

'...వాళ్లకి యేం చెప్పను? వుద్యోగం మాననన్నావనే చెప్పనా... నిన్ను యీ మాత్రం వొప్పించలేకపోతే మనిద్దరి మధ్యా గాప్స్ వున్నాయనుకుంటారేమో...

'వున్నాయి కదా...'

'ఫ్యామిలి చాల ముఖ్యం. వాళ్లు అడుగుతున్నదాంట్లో... వో.కే... ఆఖరి అనౌన్స్‌మెంట్. వెళుతున్నా. బై' విహారి చెప్పాడు.

ఉత్తర రిసీవర్ క్రెడిల్ చేసి స్వాప్నీని రెడీ చేసి ట్యూషన్ దగ్గర డ్రాప్ చేసి యింటికి వచ్చేసరికి వరండాలో సాగర్ కనిపించాడు.

'కార్టూన్ నెట్‌వర్క్ చూస్తానని గోల. లేట్ అయింది' యింటి తాళం తీస్తూ చెప్పింది.

'సాగరికా యేది' అడిగాడు.

'మ్యూజిక్ క్లాస్‌కి వెళ్లింది'

హాల్లో ఫ్యాన్ వేసి సాగర్‌కి మంచినీళ్లు యిచ్చి ఫ్లాస్క్‌లో వున్న కాఫీని రెండు కప్పుల్లో పోసి తీసుకొచ్చి అతనికో కప్పు యిచ్చి కూర్చుంటూ 'వూ చెప్పు యేమిటంత అర్జెంట్ విషయం' అడిగింది.

'మీ యిద్దరి విషయమే. నీ నిర్ణయం మార్చుకోవచ్చుగా. నువ్వు యెందుకంత పట్టుదలగా వున్నావో నాకర్థంకావటం లేదు. అమ్మ బాధపడుతుంది' అన్నాడు.

'యింతకీ నీ కొడుక్కేం పేరు సెలక్ట్ చేసావ్' అడిగింది.

'నే అడుగుతుందేంటి? నువ్వేం మాట్లాడుతున్నావ్'

'నువ్వేం అడుగుతున్నావో తెలుసు'

'అమ్మ కంగారుపడుతోంది. నాన్నగారి సంగతి తెలుసుగా బాగా చికాకు

పడుతున్నారు' అన్నాడు.

'అమ్మ కంగారు విషయం నే చూసుకుంటా. నాన్నగారికి చికాకు లేనిదెప్పుడులే'

విహారికి యిదేం అలవాటో. ప్రతి విషయాన్ని చిన్నదో పెద్దదో మూడో వ్యక్తి ప్రమేయంతో వొప్పించే వొత్తిడి తెస్తాడు.

ఉత్తర యీ విషయాలేం మాట్లాడాలనుకోవటం లేదని సాగర్‌కి అర్థమయి కాసేపు ఆ కబురు యీ కబురు చెప్పి వెళ్లిపోయాడు. స్వీటీ ట్యూషన్ అయిపోయె టైమ్ అవ్వటంతో ఉత్తర యింటికి తాళం పెట్టి కైనటిక్ తీసింది.

పెళ్లయిన యీ పదేళ్లలో చిన్నాచితక చికాకులు. సర్దుకుపోవడాలు. యే మొగుడూ పరిపూర్ణమైన శాంతిని యివ్వలేడనే యెరుక వుందేమో విహారి విషయంలో పెద్ద నిరాశేం లేదు. వొ.కే. ఎట్‌లీస్ట్ రీజనబుల్ మొగుడు. అలా వుండటం కూడా అంతకంటే అతను అన్‌రీజనబుల్‌గా వుండగలిగే అవకాశాలు లేకనే యెరుక మాత్రం లేక యిప్పుడీ పదిరోజుల్లో పదిసంవత్సరాలల్లోని శాంతిపై అనుమానాలొస్తున్నాయి.

ఆ రోజు యెర్‌పోర్ట్ నుంచి యింటికి వస్తూనే స్వీటీని గాల్లోకి యెగరేస్తూ 'యిక నుంచి నువ్వు స్కూలుకి బస్‌లో వెళ్లక్కర్లేదు. యెంచక్కా కార్లో వెళతావ్' అన్నాడు.

'యే కారు డాడి? సాంత్రో యిండికా జెన్' అడిగాడు స్వీటీ.

'నీకే కారు యిష్టం'

'టాటాసుమో'

'టాటా సుమోనా... నో... యేదైనా కారు చెప్పు'

'కారొద్దు డాడి సుమోనే కావాలి'

ఉత్తర నవ్వింది నిట్టూర్పుగా.

సాగరికాకి చాక్‌లెట్స్ యిచ్చాడు.

'నీకంతా ఖాళీనే యికనుంచి. నీక్కావల్సినన్ని పుస్తకాలు చదువుకోవచ్చు' ఉత్తరకి రెండు చీరలున్న ప్యాకెట్ అందిస్తూ చెప్పాడు.

'యేం పాతాలు కంప్యూటర్ చెప్తాయనే ప్రపోజల్ వచ్చిందా' ప్యాకెట్ విప్పుతూ

అడిగింది.

'నీకన్నీ వెటకారమే. గత పదేళ్లుగా కంప్యూటర్ వాడుతూ మిగిలిన వాళ్లు మాట్లాడితే నీకెందుకంత చికాకు' అడిగాడు.

'కంప్యూటర్ సమస్త సమస్యలని తీర్చేస్తుందనే యెరుకలేక' శ్రీమని చెప్పింది.

'వుద్యోగం వచ్చింది. సంవత్సరానికి పన్నెండు లక్షలు, యిల్లు మిగిలిన పెర్క్స్' సంతోషంగా చెప్పాడు.

'కంగ్రాట్స్'

'యీ వారంలోనే జాయిన్ అవ్వాలి' చాల పనులున్నాయి అంటూ ఫోన్ దగ్గరకి వెళ్లాడు.

తనకి వచ్చిన కొత్త జాబ్, జీతం, పెర్క్స్ స్నేహితులందరికి చెప్పాడు. రాజీనామా పత్రాన్ని మెయిల్ చేసాడు. బంధువులకి వుద్యోగం విషయం చెపుతూ ఉత్తరకి యింక యీ వుద్యోగం బాదరాబందీ లేదు. స్మోఫీ చదువుపై పూర్తి దృష్టి పెట్టటమే అని చెప్పేసాడు. ఆమె రిజిగ్నేషన్ లెటర్ టైప్ చేసి 'యింతేనా యింకేమైనా రాయాలా' అడిగాడు మానిటర్ కాస్త పక్కకి తిప్పుతూ.

'నీకు వుద్యోగం వస్తే నేనీ వుద్యోగం యెందుకు మానెయ్యాలి' అడిగిందామె.

'ఫ్యామిలీతో సహా వాళ్ల టవున్‌షిప్‌లో వుండాలన్నది వాళ్ల కండీషన్. నే వొప్పుకున్నా. వాళ్లిచ్చే జీతం ముందు నీ జీతం నెలకి రాకపోయినా యిబ్బందేం లేదు కదా' అన్నాడు.

'నీకు లేకపోవచ్చు. యిక్కడ సమస్య జీతం కాదు. వాళ్లు. వాళ్లు అడగటం నువ్వు వెంటనే వొప్పేసుకోవటం. యిన్నేళ్లుగా కాపురం చేస్తున్న నీకే నేనీ ప్రపోజల్‌కి వొప్పుకుంటానా లేదా అనే ఆలోచన లేదు. నన్ను అడిగి మీ నిర్ణయం చెప్పండనే సెన్సిటివిటీ వాళ్లకి లేదు. కాని వాళ్లకి వాళ్ల దగ్గర పని చేస్తున్నవాళ్లు కుటుంబాలతో తరలిరావాలి. కాని మాకు సెల్ఫ్‌రెస్పెక్ట్ వొకటుంటుందనే యింగిత జ్ఞానమేనా లేదు మీ యెవ్వరికి' అనేసిందామె.

'యీ వుద్యోగానికి యెంత కాంపిటేషన్ వుందో నీకేం తెలుసు? నా స్కిల్స్, క్వాలిఫికేషన్, చిన్ని కుటుంబం, యింట్లో ముసలివాళ్లు యెవ్వరూ లేకపోవటం, అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లు, తమ్ముళ్ల వుద్యోగం యిలాంటివి యేవి లేకపోవటం వాళ్లకి

బాగనచ్చింది. నేనా టైమ్ అంతా ఫ్యాక్టరీకి పెడతానని వాళ్ల ప్రొడక్షన్ని బాగ పెంచుతానని వాళ్లకి నా మీద బోల్డంత నమ్మకం తెలుసా' అన్నాడు.

ఉత్తర క్షణం తెల్లబోయి 'భలేవున్నాయే వాళ్ల ఆలోచనలు. యింకేం నేనూ పిల్లలు లేకపోతే ఆ టైమ్ కూడా మీరు ప్రొడక్షన్‌పైనే పెట్టొచ్చుగా. అదే చెప్పండి వాళ్లకి'

'వాళ్లకి యిలానే చెప్పాను. వాళ్లకి చాలబాగ మన జీవితాల గురించి తెలుసు. వాళ్లు యీ ఫ్యాక్టరీని కొంటున్నప్పుడే మన దేశస్థుల జీవితం అభిరుచులు అన్నీ స్టడీ చేసారంట. వాళ్లు వో రిలేషన్ మేనేజర్ని అపాయింట్ చేసారు. కొన్ని పనులకి భార్య పిల్లలు దూరంగా వుంటే పని సామర్థ్యం తగ్గుతుందంట. క్యాంటీన్‌లో యెంత మంచి భోజనం దొరికినా లేదా మాకే వంట బాగా వచ్చినా సరే యెక్కువ రోజులు యిష్టంగా తినలేమంట. డైనింగ్ టేబిల్ దగ్గర భార్యా పిల్లలతో కబుర్లు చెపుతూ వింటూ తినటంలో తృప్తి వుంటుందట. మంచి యిల్లు భోజనం జీతం వుండటంతోనే మనసు వుషారుగా వుండదంట. సెక్స్ చాల ముఖ్యం అంట. భార్య దూరంగా వుంటే ఆ చికాకు పనిపై పడుతుందంట. నిజమే కదా నీకు దూరంగా వొక్కరోజు వుంటే భలే చికాకుగా వుంటుంది తెలుసా' ఆమె నడుంచుట్టూ అతని చేతులు బిగుసుకుంటున్నాయి.

కొండ చిలువ పట్టులా స్ఫురించగానే ఆమె గుండె వేగం హెచ్చింది. చప్పున దులపరించేసుకుంది.

అతను ఆ దులపరింపునేం పట్టించుకోకుండా కంప్యూటర్ షట్‌డౌన్ చేసి 'అన్నం పెట్టు' అని డైనింగ్ టేబిల్ వైపు వెళుతూ 'యిన్నిన్ని ఆలోచించి సైంటిఫిక్‌గా యిండియన్ ఫ్యామిలి సిస్టమ్‌ని స్టడీ చేసి నా యీ వుద్యోగానికి ఫ్యామిలితో వుండాలని నిశ్చయించారు. యింకా వుద్యోగాలు వున్నాయి. పెళ్లికానివాళ్లు లేదా పెళ్లయి పార్టనర్ వేరే చోట వుద్యోగంలో వుండాలి. మగవాళ్లకైనా ఆడవాళ్లకయినా బాగ ప్రయాణాలు పార్టీలు వుంటాయి. ముఖ్యంగా ఆడవాళ్లకి ఆ వుద్యోగం కావాలంటే 99% పెళ్లికాకుండానే వుండాలి' అన్నాడు పుల్కాని చేత్తో తుంపుతూ.

స్వాతికి అన్నంలో నెయ్యి కలుపుతూ 'యివన్ని రూల్స్‌గా బైలాస్‌గా రాసుకున్నారా' అడిగింది.

'నో... ఆఫ్‌ది రికార్డ్. యెక్కడా యేం రాతలా వుండవ్. ఆచరిస్తారు అంతే.

యిప్పుడు రిలేషన్‌షిప్ అనేది చాల ముఖ్యం. యాడ్స్‌లో వర్క్‌ప్లేస్‌లో పొలిటిక్స్‌లో వాళ్లు ఫ్యామిలీకి చాల ప్రాముఖ్యం యిస్తున్నారు తెలుసా?' అన్నాడు.

'వాళ్లు ఫ్యామిలీ యేంటీ ట్రాష్ అంటే మీరంతా తందానతాన అనేట్టున్నారే' అందామె.

సలాడ్‌పై పెప్పర్ జల్లుతూ 'మన దేశస్థులకి కుటుంబం యెంత ముఖ్యమో వాళ్లకి బాగ తెలుసు. మనం యిష్టపడే కుటుంబాన్ని వాళ్లూ యిష్టపడతారు. దానిని మననుంచి విడకొట్టి వాళ్లు మనకి దగ్గర కాలేరని వాళ్లకి తెలుసు' అన్నాడు.

అతని యెదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ 'యీ విషయం తెలిసీ కూడా వాళ్ల ట్రాప్‌లో నువ్వెందుకు పడుతున్నావ్?' అడిగిందామె.

'యిందులో ట్రాప్ యేముంది? యెంతకాలమని పదివేలు యిరవైవేలు జీతాలకి పని చేస్తాం? పైసాపైసా కూడాపెట్టి యిల్లు కట్టుకోవటం కారు కొనుక్కోవటం పిల్లల చదువులు... చిన్ని కుటుంబం మంచిది కదా. పేరెంట్స్ చాల ముఖ్యం కాని వయస్సు మీరే కొద్ది బోల్డన్ని అనారోగ్యాలు వాళ్లకి. యెప్పుడూ అటెండ్ అవ్వటం అంటే చాల టైమ్ పెట్టాలి, యెనర్జీస్ వెచ్చించాలి. మనకి మన వర్క్‌ప్రెషర్స్‌తో యివన్ని యెక్కడ సాధ్యం చెప్పు? వాట్ దే నీడ్ యీజ్... మంచి డాక్టర్, మెడిసన్స్ వాళ్ల ఖర్చులకి సరిపడే డబ్బు కాలక్షేపానికి టి.వి. యివన్ని మనం ప్రొవైడ్ చేస్తే చాలు. వాళ్లూ సంతోషంగానే వుంటారు. లేనిపోని సెంటిమెంట్స్‌కి పోయి వాళ్లని యింట్లో పెట్టుకోవటం యెందుకు? చికాకు. రానురాను వాళ్లెప్పుడు పోతారనే యెదురుచూపు మొదలవుతుంది. మనలని యిన్‌హ్యూమన్‌గా మార్చే సెంటిమెంట్స్ వద్దనే వాళ్లూ చెపుతున్నారు అంతే. మనం బాగ సంపాదించి మన తల్లితండ్రుల అవసరాలు చూస్తే చాలు వాళ్లూమనం సుఖపడతాం. సో... స్టాక్‌కి మనం టాటాసుమో కొంటున్నాం'. కడుక్కున్న చేతుల్ని నేప్‌కిన్‌తో తుడుచుకుంటూ అన్నాడు.

ఉత్తరకి ఆకలి యెక్కువయింది. అన్నంలో రెండు చెంచాల నెయ్యి వేసుకొని పప్పుచారు పోసుకొని తినటం మొదలుపెట్టింది.

'యేయ్... యేంటి నెయ్యి వేసుకుంటావ్? వెయిట్ పెరుగుతావ్' వారింపుగా అన్నాడు విహారి.

'లావుగా వుండే భార్య నీ వుద్యోగానికి అనర్హతా' పెరుగులో మీగడ వేసుకుంటూ అడిగింది.

'పెళ్లికి ముందు నువ్వెంత నాజూగ్గా వున్నావో యిప్పుడూ అలానే వున్నావ్. యిప్పటికి నీ బ్రెస్ట్‌లైన్ వెరీ ఫార్మ్' కుర్చీ వెనక నిలబడి ఆమె భుజాలపై చేతులేస్తూ - 'మంచి వుద్యోగం అందమైన భార్య చలాకి కొడుకు బుద్ధిమంతురాలైన కూతురు. మా ఫ్రెండ్స్‌కి మనది ఐడిల్ ఫ్యామిలి అని జెలసీ కదా' నవ్వుతూ ఆమె బుగ్గపై ముద్దు పెట్టాడు.

'వూ' అంటూ అతనిని తప్పించుకొని సింక్ దగ్గరకి వెళ్లి చేతులు కడుక్కుంది డైనింగ్ టేబిల్ సర్ది పిల్లల గదిలోకి వెళ్లింది. పిల్లలకి కథ చెపుతుండగానే కలల్లోకి జారుకున్నారు. కప్పిన దుప్పటిని మరొక్కసారి సరిచేసి గదిలోకి వచ్చింది. విహారి ఎక్స్‌ఎన్‌లో సినిమా చూస్తున్నాడు. స్టాండ్ పై నుంచి నైటీని తీసుకుంటుంటే వెనకే వచ్చిన విహారి నైటీని స్టాండ్‌పైనే వేసేసి భుజాల చుట్టూ చేతులేసాడు. ఆమె కళ్లల్లోకి కాంక్షగా చూస్తున్న అతని చూపులని తప్పించుకుంటూ 'ఐ ఆమ్ నాట్ యిన్ మూడ్' అంది.

'బట్ ఐ యమ్ యిన్ మూడ్స్'

అక్కడ ఆర్గ్యుమెంట్స్ పని చేయవని ఆమెకి తెలుసు. అతని మెడ చుట్టూ చేతులేసింది.

ఆమెకి నిద్రరావటం లేదు, కలత నిద్ర. అతను మత్తుగా నిద్రపోతున్నాడు.

రేపట్నుంచి యింట్లో గొడవ తప్పేట్టు లేదు. గొడవ జరిగినా యెన్నాళ్లు... నేను మాత్రం వెళ్లను. ఆ వుద్యోగం విహారి యెన్నాళ్లు చేస్తాడో తెలియదు. వీళ్లెవ్వరికి వాళ్ళదెంత కబ్జా వ్యవహారమో అర్థం కావటం లేదా? యిల్లు వుద్యోగం జీతం భార్యా పిల్లలు... బుస్ బుస్ బాప్‌రే యింట్లో యెక్కడో పాము తిరగాడుతున్నట్టే వుంది బుస... బుస...

ఉత్తరని వొప్పించలేక విహారి వొక్కడే వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ యిచ్చొచ్చాడు. సెటిల్ చేసుకోవాల్సిన విషయాలున్నాయి. వో నెలరోజుల్లో ఫ్యామిలీని తీసుకొస్తానని చెప్పాడు.

'సెటిల్ చేసుకోవాల్సిన విషయాలా? యేంటవి?' రిలేషన్స్ మేనేజర్ అడిగాడు.

'పిల్లల స్కూల్'

'అడ్మిషన్ మేం చూస్తాం యిబ్బందేం లేదు'

'సామాను ప్యాకింగ్'

'మూవర్స్‌కి చెప్పేస్తాం'

విహారికి యింకేం చెప్పాలో తెలియలేదు.

'మీ మిసెస్ రిజిగ్నేషన్ యిచ్చేసారా' అడిగాడు.

విహారి బ్లాంక్‌గా చూసాడు.

'జాబ్ చేయకుండా వుండటం ఆమెకి యిష్టం లేకపోతే వర్రీ అయేదేం లేదు. ఆమె టీచింగ్ ప్రొఫెషన్‌లో కదా వున్నారు. యిక్కడ స్కూల్లో జాబ్ ప్రొవైడ్ చేద్దాం' అన్నాడతను.

విహారి కళ్లు వెలిగిపోయాయి.

'థ్యాంక్ యూ' అన్నాడు.

మీకే సమస్య వున్నా చెప్పండి మేం వున్నది వాటిని పరిష్కరించటానికేగా. సో వో మూడు రోజుల్లో మీరు మీ ఫ్యామిలీతో క్లబ్‌కి వస్తున్నారు' అన్నాడతను.

'ష్యూర్'

'మిసెస్ విహారికి యింకో విషయం కూడా చెప్పండి. యిప్పుడు ఆమెకి వస్తున్న జీతం కంటే ఫార్టీ పర్సెంట్ యెక్కువ జీతం వస్తుందని' చెప్పాడతను.

'హో. రియల్లీ. థ్యాంక్‌యూ'

విహారి యింటికి ఫోన్ చేసాడు.

నో రిప్లై.

ఛ...యీ టైమ్‌లో ఉత్తర వుండదు కదా యింట్లో. కాలేజ్‌కి వెళుతుంది కదా ఆనందంలో యివి యేవి గుర్తురాలేదు.

ఆ రాత్రి ఆమెకి ఫోన్ చేసాడు.

అంతా విని ఆమె చిన్నగా నవ్వింది.

'యెప్పుడొస్తున్నావ్'

'వెకేషన్‌కి'

'యేమిటి నీ అభ్యంతరం'

'కాస్త పాత విహారిలా ఆలోచించు సరేనా'

'ఉత్తరా నా సహనాన్ని పరీక్షిస్తున్నావ్'

ఆమె మాట్లాడలేదు.

అతను ఆమెని వొప్పించడానికి వచ్చాడు వీకెండ్‌కి.

ఆమె నిర్ణయాన్ని మార్చుకోలేదు.

అతను వెళుతూవెళుతూ ఎయిర్ పోర్ట్ నుంచి కాల్ చేసాడు ఆమె వొప్పుకోలేదు.

మొండితనం. పొగరు... విహారికి చప్పున స్ఫ్రేసింది ఉత్తరని నోటికొచ్చినట్టు యెలా అనెయ్యగలిగాడు. ఉత్తరకి నేనంటే అస్సలు ఖాతరే లేదు. ప్రేముంటే గౌరవముంటే యిలా యెలా మాట్లాడుతుంది అంత ఖచ్చితంగా తన మాటపై యెలా నిలబడుతుంది.

'యేమయింది విహారి' రిలేషన్ మేనేజర్

'రానంటుంది' విహారి స్పష్టంగా చెప్పేసాడు.

'రానన్నారా?! యెక్కువ జీతం తక్కువ పని... రానన్నారా' తన థియరీ లాజిక్ యెక్కడ గాడి తప్పింది?! చదువుకున్న నేర్చుకున్న ప్రిన్స్‌పల్స్‌ని తు.చా. తప్పకుండా అప్లై చేసినా యెందుకని ఫలితం రాలేదు. రిఫ్రెష్‌మెంట్ కోర్సు అవసరమేమో తనకి అన్న సందేహం వచ్చింది రిలేషన్స్ మేనేజర్‌కి.

డబ్బు ముఖ్యం - కంఫర్ట్స్ ముఖ్యం కెరీర్ ముఖ్యం కుటుంబం ముఖ్యం... పిల్లల చదువులు ముఖ్యం... ఆరోగ్యం ముఖ్యం... సేవింగ్స్ ముఖ్యం... ఆస్తి ముఖ్యం... భక్తి ముఖ్యం... యివన్నీ యిచ్చినా యిస్తామంటున్న రానంటుందంటే యీ ఉత్తర కమ్యూనిస్టా .... ఫెమినిస్టా.... యాక్టివిస్టా....?! యింకెక్కడ కమ్యూనిజం... దారులన్నీ బార్లా తెరిచి స్వాగతతోరణాలు వేలాడదీసాక... అన్ని దారులూ వొక్కటే కదా... అయివుండకపోవచ్చు.

'ఆమె రైటరా' అడిగాడు

అనుకోని యీ ప్రశ్నకి 'కాదు కాదు' అయోమయంగా అన్నాడు విహారి.

'బాగ చదువు తారా'

'ఆ...బాగ చదువుతుంది'

'అదీ విషయం. లేనిపోని సిద్ధాంతాలు థియరీలూ వొంటపట్టించుకొని యిలా ప్రవర్తిస్తారు. ఆమె సెంటిమెంట్ పై ప్లే చేసి ఆమెని వొప్పించండి' సలహా యిస్తూనే వాళ్ల వల్ల జరిగేదేంటో తెలియవచ్చే సాహిత్యాన్ని వార్తలని సినిమాలని సెన్సార్ చెయ్యాల్సిన అవరాన్ని నోట్ చేసుకున్నాడు. వీడియో కాన్ఫరెన్స్‌కి కొత్త పాయింట్ దొరికిందనే ఆనందంలో అతనికి సలహా యిచ్చాడు.

సెంటిమెంట్... తలని యెంత విదిల్చినా ఉత్తరకి వున్న సెంటిమెంట్స్ యేం గుర్తు రావటం లేదు... స్పార్టీ ... యస్ స్పార్టీ. సాగరికా నో యూజ్, వాళ్ల అమ్మ బుద్ధులు. స్పార్టీ మై సన్... డాడీ దగ్గరకి వెళ్లిపోదాం... స్పార్టీ... స్పార్టీ టాటాసుమో యిస్తాను. కార్టూన్ నెట్‌వర్క్ రోజూ నీ యిష్టం వచ్చినంత సేపు చూడు. వీడియోగేమ్స్ ఆడుకో. నో హోమ్‌వర్క్ సరేనా. డాడీ దగ్గరకి వెళ్లదామని బాగ యేడుస్తావా.

'డాడీ క్రెడిట్‌కార్డ్ వుంటే అన్ని కొనుక్కోవచ్చుగా యిస్తావా'

'మరి యేడుస్తావా'

వూ...వుత్తిగానేా...

'గట్టిగా. మమ్మీ వొప్పుకోపోతే అన్నం తినని చెప్పు'

'అన్నం మానేస్తే చాక్‌లెట్స్ యివ్వాలి'

'ష్యూర్'

'మమ్మీ, డాడీ కావాలి' దీర్ఘం తీసాడు.

'యేంటి స్పార్టీ యేంటి...అలా యేడవకూడదు...విహారి పేపర్లోంచి తల తిప్పి అన్నాడు.

'డాడీ కావాలా?! సరే నీ బట్టలు బొమ్మలు వీడియో గేమ్స్ అన్ని సర్ది పెడతాలే. నీ క్లాస్ పుస్తకాలు కావాలా వద్దా' స్పార్టీ స్కూల్ యూనిఫామ్‌ని ప్రెస్ చేస్తున్న ఉత్తర అడిగింది.

తండ్రీకొడుకులు డ్రామాలో తరువాత డైలాగ్ మర్చిపోయిన ముఖంతో దిక్కులు చూసారు.

సలహాలు యివ్వటానికి రిలేషన్స్ మేనేజర్ లేడు.

ఉత్తర స్పార్టీ వస్తువులన్నీ సర్దేసింది.

'యిదేంటి' అడిగాడు విహారి.

చెప్పిందామె.

'మరి నువ్వూ'

'చైల్డ్ సెంటిమెంట్ డైరెక్టర్ యెవరికైనా చెప్పండి యీ థీమ్' చిర్నవ్వుతో అంది.

'యీడియట్. అందుకే నువ్వు కమ్యూనిస్ట్‌వా ఫెమినిస్ట్‌వా యాక్టివిస్ట్‌వా అని

అడిగాడు మా రిలేషన్స్ మేనేజర్' విహారి సూట్‌కేస్ సర్దుకొంటూ అన్నాడు.

'స్త్రీనని చెప్పు'

'ఫూల్' సూట్‌కేస్ తీసుకొని వెళ్లిపోయాడు.

మనుషుల్లోని నిస్సహాయత యెంతటి మాటలైనా పలికిస్తుంది అనుకొంది ఉత్తర.

* * *

'రెండే పద్ధతులు. మీరు మీ భార్యని వొప్పించటం లేదా రాజీనామా' అన్నాడు రిలేషన్స్ మేనేజర్.

విహారి బ్లాంక్‌గా చూసాడు.

'వొప్పించటం చాలా ముఖ్యం. వ్యాపారంలో భార్యనే వొప్పించలేని మీరు యీ ప్రపంచాన్ని యేం వొప్పిస్తారు? మెప్పిస్తారు? పై వాళ్ల అభిప్రాయం యిది' అన్నారు వాళ్లు. తనకేం మాటొస్తుందోనని రిలేషన్స్ మేనేజర్ గుండెలు లబలబలాడాయి. రాజీనామా యిచ్చేసి రఘు దగ్గరకి వెళ్లాడు విహారి. చెప్పాపెట్టకుండా వచ్చిన స్నేహితుడిని చూసి కాస్త ఆశ్చర్యం ఆనందం.

'కొత్త వుద్యోగం యెలా వుంది' అడిగాడు రఘు.

'రిజైన్ చేసా'

'రిజైన్... ఎందుకు?'

'ఉత్తర రానంది. వాళ్ల కండీషన్ ఫ్యామిలీతో వుండాలని'

'వో. ఐ. సి. ఉత్తర యింత మొండిదా? యెప్పుడూ అలా కనిపించలేదే' అన్నాడు రఘు.

'నాకిష్టమైన పార్క్ అవెన్యూ సబ్బులు క్లోజప్ టూత్ పేస్ట్ ఆకు కూరా పప్పు వంకాయ వగరు కంది పచ్చడి నూడుల్స్ యింట్లో తనూ వాడుతుంటే చేస్తుంటే ఉత్తర నా యిష్టాలకి యెదురు చెప్పదనుకున్నా. కానీ తనకి నా మీద కన్నా తన విషయాలపట్లే ఆసక్తి' అన్నాడు.

'మీరు వాళ్లకి మాట యిచ్చే ముందు వొక్కసారి ఉత్తరని అడగాల్సింది' అంది పూర్ణిమ.

'బానే వుంది నీ సలహా. మీరంతా వొక్కటే' వెక్కిరించాడు రఘు.

విహారి పళ్లెంలో అల్లం పచ్చడి వేస్తూ 'మీరు పనిలో సరిగ్గా రిజల్ట్స్ చూపించకపోతే వాటికి కారణం మీతో ఫ్యామిలి లేకపోవటం వల్ల అనుకొంటే ఉత్తర విషయం పట్టుపడితే అర్థముంది. యిలా మీ వుద్యోగమా ఉత్తర రాజీనామానా అని పజిల్ పెడితే యెలా? అంత నిర్దాక్షిణ్యంగా రిజైన్ చేయమనే వాళ్లతో ఉత్తరని పోలుస్తూ ఆమెకి మీ మీద ప్రేమ లేదంటారేంటి' పూర్ణిమ అడిగింది.

'నీకేం తెలుసు ప్రపంచం యెంత మారిపోయిందో. దోశెలు వేయటం అనుకుంటున్నావేంటి' రఘు పూర్ణిమని వారించాడు.

విహారి రఘు సాయంత్రాలు బయట తాగి పన్నెండు వొంటిగంట వరకు కబుర్లు చెప్పుకుంటూ తిరిగేవారు. మేడ్చెల్ రోడ్డులో యేదో వొక ధాబాలో తిని యింటికి వెళ్లేవాళ్లు. విహారికి రఘుకి పేర్లర్ రిలేషన్‌షిప్స్ వుండటం తెలుసు. కానీ యిప్పుడు రఘు కాజువల్ సెక్స్‌ని ప్రిఫర్ చేయటం చూసి 'యీ ఛేంజ్ యేమిటి' అడిగాడు.

'రిలేషన్స్ మెయిన్‌టైన్ చేయటానికి టైమ్ యెక్కడుంది? యివి అయితే టైమ్ వున్నప్పుడు రిలాక్స్ అవ్వొచ్చు. మరో రిలేషన్ పై టైమ్ యెనర్జీస్ వేస్ట్ చేసేకంటే కెరీర్ మీద దృష్టి పెట్టొచ్చు' అన్నాడు.

విహారికి ఆసక్తిగా అనిపించి 'వెరి యింట్రస్టింగ్' అన్నాడు.

'యూ వాంట్ టు ట్రై'

విహారి నవ్వాడు.

రఘు దగ్గరకి వచ్చి నెల అయినా విహారి ఉత్తరకి ఫోన్ చేయలేదు. పిల్లలు గుర్తొచ్చినా సరే చేయకూడదనే పట్టుదలతో వున్నాడు.

మరో పదిహేను రోజులు అక్కడక్కడా గడిపి యింటికి వచ్చాడు. ఉత్తరతో అతనేం మాట్లాడలేదు. తినటం. పేపర్ చదవటం. సాయంత్రం సముద్రపు వొడ్డు యే అర్ధరాత్రో రావటం. బయట అప్పుడప్పుడు క్యాజువల్ సెక్స్. తమిద్దరి మధ్యా నిశ్శబ్దాన్ని బ్రేక్ చేయటం యెలాగో ఉత్తరకి అర్థం కావటం లేదు.

ఆ రాత్రి ఆమె అతని జుట్టుని చేతివేళ్లతో మెల్లగా నిమురుతూ చెవి పక్కన ముద్దు పెట్టింది. అతను చికాగ్గా 'ఐ యామ్ నాట్ యిన్ మూడ్' అని ఆమె వైపు తేరిపార చూస్తున్నాడు.

అతని కాలర్ బోన్‌పై ముద్దుపెడుతూ 'ఐ యామ్ యిన్ మూడ్స్' అంది. అతను చూపులని ఆమె కళ్ల వైపు తిప్పుతూ 'ముసలితనం వచ్చేసింది నీకు. పేడ్ డ్

్రా వాడు' అన్నాడు.

నాలుగు నెలల క్రితం అతను తన శరీరాన్ని మెచ్చుకుంటూ చేసిన కామెంట్ గుర్తొచ్చిందామెకి. ఆమె చేతి వేళ్లు అతని భుజంపై బిగుసుకుంటున్నాయి. అతను ఆమె చేతిని విసిరేస్తూ 'డోంట్ ప్లే విత్ బాడీ' అన్నాడు.

ఆమె శరీరం మంచు తుఫాన్ అయింది.

అతని విదిలింపూ కంఠకాఠిన్యం ఆమెని వెంటాడుతునే వున్నాయి. రోజులు గడుస్తున్నాయి. స్నేహితులు బంధువుల ముందు కాపురం సజావుగా సాగుతోంది. పిల్లల్ని సినిమాలకి ఐస్‌క్రీమ్ పార్లర్స్‌కి విహారి తిప్పుతూనే వున్నాడు.

అతనికి మరో వుద్యోగం వచ్చింది. యీ వుద్యోగానికి ఫ్యామిలీ కండీషన్ లేదు. అతను తన బట్టలు, కావల్సిన చిన్ని చిన్ని వస్తువులు సర్దుకొని విమానం ఎక్కేసాడు.

టెలిఫోన్‌లో పిల్లలతో సంభాషణ. స్నేహితులతో సంభాషణ. బంధువులని పలకరించటం.

యింటికి వచ్చినప్పుడు వొక్క ఉత్తరతో తప్ప అతనికి తెలిసిన సమస్త ప్రపంచంతో ఆప్యాయంగా వుంటాడు. అతనొచ్చిన రెండో రోజు ఉత్తరకి జ్వరం. కడుపునొప్పితో గిలగిలలాడుతోంది. అతను కనీసం యేమయిందని అడగనైనా అడక్కుండా టి.వి. చూస్తున్నాడు. తెలిసినవాళ్లు వస్తే కబుర్లు చెపుతున్నాడు. పిల్లల్ని పంపించి ఆటో తెప్పించుకొని డాక్టర్ దగ్గరకి వెళ్లొచ్చింది. రెండ్రోజుల తర్వాత ఆమెకి కాస్త రిలీఫ్‌గా అనిపించింది. కాలేజ్‌కి వెళదామా మరో రోజు రెస్ట్ తీసుకుందామాని ఆమె ఆలోచిస్తుండగా అతని స్నేహితుని నుంచి ఫోన్ వాళ్ల ఆవిడకి బాగోలేదని.

'అరే జ్వరమా? నిర్లక్ష్యం చేస్తే యెలా? నే వస్తున్నా కారు తీసుకొని. డాక్టర్ దగ్గరకి వెళదాం' ఆత్రంగా బయలుదేరి వెళ్లాడు.

నువ్వు నాకేం కావ్ - అని అతను చాల యెరుకతో ఆమె పట్ల ప్రవర్తించడాన్ని ఉత్తర గమనించింది.

చిన్నిచిన్ని మాటలు తప్ప తగాదాలేం లేవ్. ప్రశ్నించి నిలదీసి వాదించి యీ పరిస్థితిని చక్కదిద్దుకోవటం కుదర్దని ఆమెకి తెలుస్తూనే వుంది.

అతన్ని తనూ యిగ్నోర్ చేస్తే... ఆమెకి నవ్వొచ్చింది. ఆలోచించి ఆలోచించి తనకి మగపైత్యం వొంటపట్టినట్టుంది. వాళ్ల ప్రవర్తన మనసుకి బాధిస్తుందని

దిగులుపడుతూ వాళ్లు మారితే బాగుండునని తలపోస్తూ దీనికి యెక్కడా వో అంతు దారి కనిపించక పోగానే వాళ్లు ప్లే చేసే అమానవీయ కార్డ్స్ మనమూ ప్లే చేస్తే అనే ఆలోచన రావటం... నో నో.. ముందు నా యీ ఆలోచనల తుప్పుని వదిలించుకోవాలి.

బుసబుసలు ఆపాలంటే ముందీ పాము యెక్కడుందో? ఆ కనీ కనిపించని పాముని బంధించటానికి యే కొత్త బుట్టలని అల్లాలో... జీవితాన్ని చుట్టుకుపోతోన్న కుబుసాన్ని విదిలించుకునే నేర్పుని యే టెక్నాలజీ యిస్తుందో... అసలిస్తుందా...

మానిటర్ ముందు కూర్చుని సెర్చ్ యింజన్ వైపు చూస్తుంది ఉత్తర.

సైన్స్-టెక్నాలజీ బోల్డన్ని యంత్రాలని యిచ్చి పనిభారాన్ని తగ్గిస్తున్నాయి. మరోవైపు ప్రపంచంలోని యెవరినైనా యెక్కడైనా యెప్పుడైనా అత్యంత వేగంగా సౌకర్యంగా పలకరించే అవకాశాన్ని యిచ్చింది. కానీ అత్యంత ఆప్తుల మధ్య దూరాలేంటీ? బెడ్‌రూమ్స్‌లో బెడ్స్ మధ్య దూరం యెందుకో?

వెబ్ సైట్ నాట్ ఫౌండ్.... బుస బుస.... యిమోషనల్ వైలెన్స్.కామ్

మానిటర్ పై అక్షరాలు... ఆమె చదువుదామని అనుకుంటుండగా కనెక్షన్ తెగింది. తిరిగి సెర్చ్ మొదలుపెట్టింది.

యిమోషనల్ వైలెన్స్.కామ్

కుబుసం విప్పింది. అయినా ఆనవాలు దొరకదు. పాములు... పాములు... పాముల్లేని చోటెక్కడైనా వుందా...

'అమ్మా'... తూనీగలా రివ్వున గదిలోకి వస్తూ ఉత్తర చీర కుచ్చిళ్లలో తలపెట్టుకొని ఆమె నడుంని చిన్నిచిన్ని చేతులతో చుడుతూ కాస్త మెడ పైకి యెత్తి 'అమ్మా... హోమ్‌వర్క్ ప్రేమ ఐలవ్ మై కంట్రీ. ఐ లవ్ మై పేరెంట్స్. ఐ లవ్ మై హోమ్. ఐ లవ్ మై స్కూల్... యేదో వొక లవ్. ఫ్రెండ్‌కి లెటర్ రాయాలంట. ప్రేమంటే యేంటి మమ్మీ?' అడిగింది సాగరిక. ఆమె వెనకే పక్కింటి పాప చేతుల్లో బంతితో.

ప్రేమంటే...

'లవ్.కామ్ చూడండాంటి'. పక్కింటి పాప సలహా యిచ్చింది. అంటే యేమొస్తుందో అంతోయింతో తెలిసిన ఉత్తరాకి నవ్వొచ్చింది. అత్యధిక టర్నోవర్ సెక్స్. సక్సస్‌ఫుల్ బిజినెస్.

కంప్యూటర్ షట్‌డవున్ చేస్తూ ప్రేమంటే... మానవీయ స్పర్శ... ప్రేమంటే మీరు... ఉత్తర మాటలు గొంతులో వుప్పలగుప్ప తిరుగుతున్నాయి. ఆమె మాపుల్లో వుత్సాహ ప్రవాహం తుళ్లింతగా... సాగరికాని యెత్తుకొని పైకి యెగరేసి పట్టుకొంటూ 'ప్రేమంటేనా...'

❖